ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 15 నవంబరు 2025



సీఐఐ పెట్టుబడుల సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు, విదేశీ రాయబారులు, ప్రతినిధులు



వేదికపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు

ఆరంభం అదిరింది

భాగస్వామ్య సదస్సు తొలిరోజు సూపర్‌హిట్

- ఎటుచూసినా పారిశ్రామికవేత్తలు... కిక్కిరిసిన హాళ్లు
- రాష్ట్రం దశ, దిశ మారేలా భారీగా ఒప్పందాలు
- వారం రోజుల్లో లూలూ మాల్‌కు శంకుస్థాపన
- విశాఖలో రూ.2,500 కోట్లతో సెమీ కండక్టర్ పరిశ్రమ
- భోగాపురంలో ఏరో స్పేస్ సిటీ ఏర్పాటు
- మధురవాడలో రూ.500 కోట్లతో జలవిహార్

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు రాష్ట్రం దశ, దిశ మార్చేలా తొలిరోజు విజయవంతమయ్యింది. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు భారీగా తరలిరావడంతో సదస్సు ప్రాంగణం కిక్కిరిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు ఉత్సాహంగా ముందుకురావడంతో తొలిరోజే ఏకంగా 360 ఒప్పందాలు జరిగాయి. శనివారం మరిన్ని సంస్థలతో ఎంవోయూలు జరగనున్నాయి. సదస్సు ఏర్పాట్లు, ఆతిథ్యం, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు చర్చించిన తీరుపై పారిశ్రామికవేత్తలు ప్రశంసలు కురిపించారు. సీఎం చంద్రబాబునాయుడు విజన్‌తో పెట్టుబడులు వరదలా వస్తున్నాయని, వీటితో ఆంధ్రప్రదేశ్ ముఖ చిత్రం మారుతుందని, యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని వారు తెలిపారు.

నగరంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఊహించని సంఖ్యలో ఆహూతులు, పారిశ్రామికవేత్తలు తరలిరావడంతో సదస్సు సూపర్‌హిట్ అయింది. ప్లీనరీ ప్రారంభోత్సవంలో కుర్చీలు చాలక చాలామంది నిల్చొనే ప్రముఖుల ప్రసంగాలు ఆలకించారు. సదస్సు ద్వారా సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాలనేది ప్రభుత్వం లక్ష్యం కాగా తొలిరోజే 365 కంపెనీలు కలిపి రూ.8,26,668 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయి.



లూలూ మాల్ ఏర్పాటుపై ఎంఓయూ అనంతరం అధినేత యూసఫ్ అలీని సత్కరించిన సీఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో కంపెనీ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు.

వారంలో లూలూ శంకుస్థాపన

విశాఖపట్నంలో రూ.2,500 కోట్లతో సెమీ కండక్టర్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఆర్సిప్ టెక్నాలజీ ఎంఓయూ చేసుకుంది. లూలూ అధినేత యూసఫ్ అలీ మాట్లాడుతూ వారం రోజుల్లో షాపింగ్ మాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. దానిని మూడేళ్లలో పూర్తిచేస్తామన్నారు. అదేవిధంగా జలవిహార్ సంస్థ రూ.500 కోట్లతో మధురవాడలో హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుంది.

ఎటుచూసినా సందడే

సదస్సుకు దేశ, విదేశాల నుంచి భారీగా అతిథులు తరలి వచ్చారు. అధికారులు ... మిగతా 8వ పేజీలో

పారిశ్రామికవేత్తలకు ఏపీ స్వర్గధామం

సీఐఐ సమ్మిట్‌లో పలువురు అభిప్రాయం

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ స్వర్గధామమని పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న భరోసాతో సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగుతోందన్నారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో ప్రభుత్వంతో పలు ప్రాజెక్టులకు ఎంవోయూలు చేసుకున్నామని వివరించారు.

రూ.650 కోట్లు పెట్టుబడి పెడుతున్నాం..



అమెరికా అంతటా 2,500 చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు ఐటీ సర్వ్ అలియన్స్ ప్రాతినిథ్యం వహిస్తోంది. మంత్రి లోకేశ్ ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చాం. ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో విశాఖలో రూ.650 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ఎంవోయూ చేసుకున్నాం. 10 వేల ఉద్యోగాలు కల్పిస్తాం. కాపులుప్పాడలో పది ఎకరాలు కేటయించారు. - **అంజు వల్లభనేని**, ప్రెసిడెంట్, ఐటీ సర్వ్ అలియన్స్ అమెరికా

ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డు రంగంలో రూ.350 కోట్ల పెట్టుబడి



ప్రస్తుతం గుజరాత్‌లో ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డు పరిశ్రమ నిర్వహిస్తున్నాం. అటువంటి యూనిట్‌ను సుమారు రూ.350 కోట్లతో ఏపీలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. ఎక్కడ ఏర్పాటు చేసేది ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుంది. ఈ పరిశ్రమ ద్వారా 850 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశ అవసరాలకు ప్రస్తుతం ఇతర దేశాల నుంచి ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డులను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ రంగంలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకునేలా పెట్టుబడులను పెట్టబోతున్నాం.

- **వికాస్ అగర్వాల్**, గుజరాత్

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్‌భరత్ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు అతనిని కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఆ తరువాత ఆయన వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ పరిధిలో ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులపై ఇరువురూ చర్చించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తేజ్ భరత్

బస్సు ప్రయాణికుల పాట్లు

ప్రజల అవసరాలకు సరిపడ నడవని ఆర్టీసీ బస్సులు

- కిక్కిరిసిపోయి ఓవర్‌లోడుతో నడుస్తున్న వైనం
- పలు స్టేజీల్లో బస్సులు ఆపడంలేదని ప్రయాణికుల ఆరోపణ
- సాయంత్రం అయితే జాతరను తలపిస్తున్న ఎలమంచిలి బస్టాండ్
- బస్సెక్కాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి



ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు, విద్యార్థినులు.. రోజూ సాయంత్రంపూట ఇదే పరిస్థితి!

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల అవసరాకు సరిపడ ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో నిత్యం వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. 'స్త్రీ శక్తి' పథకం అమలుకాకముందు నుంచే ఈ సమస్య వుండగా.. మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తరువాత మరింత పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియాకు అనుగుణంగా అధికారులు అదనంగా బస్సు సర్వీసులను ప్రవేశపెట్టకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే దినసరి కూలీలు, చిరుద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

ఎలమంచిలిలో ఉన్న కళాశాలలు, పాఠశాలల్లో చుట్టుపక్కల గ్రామాలు/ మండలాలకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరు రోజూ ఆయా గ్రామాల నుంచి ఎలమంచిలికి రాకపోకలు ... మిగతా 8వ పేజీలో



బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న ప్రయాణికులు

వానపోయి.. దుమ్ము వచ్చే..

రాళ్లు, కంకర తేలిన వడ్డాది- పాడేరు రోడ్డు

- లారీలు, బస్సులు వెళుతున్నప్పుడు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు



ముకుందపురం సమీపంలో ఎగిసిపడుతున్న తెల్లటి దుమ్ము

మాడుగుల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్డాది- పాడేరు ఆర్‌అండ్‌బీ రహదారిపై మండల పరిధిలో వర్షాకాలమంతా పంట కుంటలను తలపించిన గోతులతో ఇబ్బంది పడిన వాహనదారులు, ప్రయాణికులు.. ఇప్పుడు దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర పలుచోట్ల రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి చెరువులను తలపించేవి. వాహనదారులు ఇక్కట్లు వర్ణనాతీతం. అల్లూరి సీతా రామరాజు జిల్లా పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల ప్రజలు చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నానికి, అదే విధంగా మైదాన ప్రాంతం నుంచి పాడేరు, చుట్టుపక్కల మండలాలకు వెళ్లే వారు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. రోడ్డు దారుణంగా వుండడంతో వడ్డాది నుంచి తాటిపర్తి వరకు ప్రయాణించడానికి 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతున్నది. వర్షాకాలం ముగియడంతో వాహనదారులకు మరో రకమైన సమస్య ఎదురైంది. సుమారు రెండు వారాల నుంచి వర్షాలు పడకపో వడంతో వాహనాలు వెళుతున్నప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి ఎగిసిపడుతున్నది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తున్న వారి కళ్లల్లో దుమ్ము పడి ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వడ్డాది- తాటిపర్తి మధ్య రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను గత ప్రభుత్వ హయాంలో చేపట్టారు. ఇరువైపులా మీటరు చొప్పున వెడల్పు చేయడంతోపాటు రహదారి బాగా దెబ్బతిన్న ... మిగతా 8వ పేజీలో



కేజేపురం వద్ద రహదారిపై తేలిన రాళ్లు, కంకర

అడ్డదిడ్డంగా పార్కింగ్

ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలు నిలుపుదల

- ఇబ్బంది పడుతున్న పాదచారులు, ఇతర వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రైల్వేస్టేషన్ ముందు 'నో పార్కింగ్' ప్రదేశంలో నిలిపిన ద్విచక్ర వాహనాలు



ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖద్వారం ముందు అడ్డదిడ్డంగా నిలిపి ఉంచిన వాహనాలు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టమొచ్చిన రీతిలో పార్కింగ్ చేస్తున్నారు. పోలీసులు 'నో పార్కింగ్' అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినచోట కూడా వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు, ఇతర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ తరహా సమస్య రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, భీమునిగుమ్మం హైస్కూల్, దాసరిగెడ్డ రోడ్డులో సత్తెమ్మతల్లి ముఖద్వారం, మరికొన్ని ప్రాంతాల్లో ... మిగతా 8వ పేజీలో

విద్యార్థి మృతిఘటనలో నలుగురిపై కేసు

తిమ్మరాజుపేటలో రెండో రోజూ కొనసాగిన ఉద్రిక్తత

- పాఠశాల నిర్వాహకులను అరెస్టు చేయాలని డిమాండ్
- పోలీసు ఉన్నతాధికారుల హామీతో ఆందోళన విరమణ

మునగపాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేట డావిన్సీ స్కూలు స్విమ్మింగ్ పూల్‌లో పడి ఒకటో తరగతి విద్యార్థి మృతిచెందిన ఘటనకు సంబంధించి రెండో రోజు కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. పాఠశాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలుడి కుటుంబీకులు డిమాండ్ చేశారు. పోలీసులు అధికారులు పాఠశాలకు చెందిన ఇద్దరు నిర్వాహకులు, బస్సు డ్రైవర్, మృతిచెందిన విద్యార్థి క్లాస్ టీచర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

ఎలమంచిలికి చెందిన జనపరెడ్డి శ్రీనివాసరావు, నాగశ్రీలత, దంపతుల కుమారులు ప్రశాంత్, మోక్షిత్ సందీప్ మునగపాక మండలం తిమ్మరాజుపేటలోని డావిన్సీ స్కూలులో ఆరో తరగతి, ఒకటో తరగతి చదువుతున్నారు. రోజూ బస్సులో వెళ్లివస్తుంటారు. గురు వారం ఉదయం సాయంత్రం స్కూల్ నుంచి పెద్ద కుమారుడు ఒక్కడే రావడంతో. ఆందోళన చెందిన తల్లి శ్రీలత.. బస్సు డ్రైవర్, తరగతి టీచర్, ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కుటుంబీకులతో కలిసి పాఠశాలకు వెళ్లారు. స్విమ్మింగ్ పూల్ పక్కన సందీప్ మృతిచెంది కనిపించాడు. దీంతో నిర్ఘాంతపోయిన వారు కన్నీరుమున్నీరు అయ్యారు. పాఠశాల యాజమాన్యం ... మిగతా 8వ పేజీలో



విలపిస్తూ స్కూల్ వద్దకు వస్తున్న మృతుడి తండ్రి శ్రీనివాసరావు



పోలీసుల అదుపులో డైరెక్టర్ రమణాజీ, ఎండీ సుందరయ్య

'అంగన్‌వాడీ ప్రీస్కూళ్లకు బడ్జెట్ పెంచాలి'

అచ్యుతాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ప్రీస్కూల్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం దిబ్బపాలెం సచివాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు జరిపిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను ప్రీస్కూల్స్‌గా చేసి మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలను చేర్చే విధంగా జీఓ విడుదల చేయాలన్నారు. అలాగే ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలుచేసి యూనిఫారమ్, బ్లై, బూట్లు ఇవ్వడంతో పాటు మెనూ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.రాము, కె.సోమినాయుడు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వరలక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వెంకటరమణ మృతి



వెంకటరమణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కర్రి వెంకటరమణ శుక్రవారం ఉదయం తన గృహంలో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తెల్లవారుజామున మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఈయన టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా, పార్టీలో పలు పదవులు నిర్వహించారు. వెంకటరమణ మృతదేహానికి రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకురాలు ఆడారి మంజు, పీలా తులసీరాం, కర్రి ఆదిబాబు తదితరులు ఉన్నారు.

బిక్ష దాతలకు ఘన సత్కారం

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో అయ్యప్ప, శివయ్య, భవానీ దీక్షాపరులకు శుక్రవారం బిక్ష ఏర్పాటు చేసిన దాతలను ఘనంగా సత్కరించారు. ఆచంట రామకృష్ణ, డీవీ రామారావు దంపతులు సహా పాకలపాటి రామకృష్ణరాజులను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పండుశర్మ, శ్రీపాద ప్రణవ్ శ్రీరామ్ తదితరులు దుశ్శాలువలతో సత్కరించారు. అమ్మవారికి జ్ఞాపికలను, శేషవస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కోసూరి శ్రీను, డాక్టర్ కిశోర్ కుమార్, నరిశేహరి ప్రసాద్, గురుభవానీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి 'ఉపాధి హామీ' దోహదం

మునగపాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంక్షేమాభివృద్ధికి దోహదపడుతుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం ద్వారా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో పనులకు తీర్మానం చేశారు. పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ తన సొంత నిధులతో వస్త్రాలను అందజేసి, వారికి బీమా సదుపాయం చేశారు. ఈ సమావేశంలో పెంటకోట సత్యనారాయణ, దాడి మునిలినాయుడు, దొడ్డి గోవింద పాల్గొన్నారు.

దల్లమాంబ ఘటం ఊరేగింపు

రాంబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలిలో అమ్మవారి ఘటాన్ని శుక్రవారం ఊరేగించారు. అమ్మవారి ఘటానికి భక్తులు పూజలు చేశారు. గ్రామంలో ఈనెల 18న మంగళవారం జరగనున్న బురదమాంబ అమ్మవారి జాతర వరకు దల్లమాంబ అమ్మవారి ఘటాన్ని ప్రతి రోజు భక్తులు డప్పుల వాయిద్యాల పుర వీధుల్లో ఊరేగించడం జరుగుతుందని పెద్దలు తెలిపారు.

కొనసాగుతున్న మత్స్యకారుల నిరసన

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ రాజయ్యపేటలో మత్స్యకారులు చేపడుతున్న నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 62వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరం వద్ద మత్స్యకారులు మెడకు ఉరితాళ్లను బిగించుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిక్కి తాతీలు, మైలపల్లి మహేశ్, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేశ్, యజ్జల అప్పలరాజు, కాశీరావు, నూకమ్మ, చినతల్లి, కొర్లయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు అండగా వుంటాం : యూటీఎఫ్

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు అండగా వుంటామని యూటీఎఫ్ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్రావ్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్‌కే శాస్త్రి, గారా రాజబాబు, జిల్లా కార్యదర్శి కె.సతీశ్ హామీ ఇచ్చారు. శుక్రవారం పలు పాఠశాలల్లో పనిచేసే నూతన ఉపాధ్యాయులను కలిసి యూటీఎఫ్ డైరీలు, సీఎల్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జయనాయ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ ప్రారంభం



ర్యాలీని జెండా ఊపుతున్న తహశీల్దార్ తిరుమలబాబు

కోటవురట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెండో రోజూ చేపట్టిన సైకిల్ ర్యాలీని శుక్రవారం తహశీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ ప్రారంభించారు. తంగేడు, సుంకపూర్, జల్లూరు, యండపల్లి, అన్నవరం జంక్షన్ వరకు సాగింది. అక్కడి నుంచి నర్సీపట్నం రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

చట్టాలపై కార్మికులకు అవగాహన

ఎస్.రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం, జేవీ పాలెం గ్రామాల్లో ఉన్న రొయ్యల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎలమంచిలి కోర్టు ప్యానల్ టి.నూకరాజు, తహశీల్దార్ రమేష్‌బాబుతో కలిసి ఆయా పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్భంగా లాయర్ నూకరాజు మాట్లాడుతూ న్యాయ చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎలమంచిలి కోర్టు పారా లీగల్ వలంటీర్ చిరంజీవి, ప్రసాద్‌కుమారి, రాజేష్, సీహెచ్ రాజు, శివ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు

ఎస్.రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదఉప్పలం గ్రామంలో శుక్రవారం తుని మమతా హాస్పటల్ సౌజన్యంతో స్థానిక టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 250 మంది రోగులను డాక్టర్లు విహారి, కె.మంగాలక్ష్మి తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానిది ప్రజారంజక పాలన : పప్పల



టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు, నేతలు

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. శుక్రవారం ఎలమంచిలి టీడీపీ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, దూళి రంగనాయకులు, గొర్లె నానాజీ, లాలం భరత్ తదితర నేతలు వినతులను స్వీకరించారు. అనంతరం చలపతిరావు మాట్లాడుతూ టీడీపీ క్రమశిక్షణకు మారుపేరని, అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యంగా ముందుకు సాగాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు సుపరిపాలన దిశగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ అహర్నిశలూ శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్, పీలా తులసీరామ్, నేతలు బొద్దపు శ్రీను, కరణం రవి, దంట్ల స్వామి పాల్గొన్నారు.

సీఎంను కలిసేందుకు 52మందితో కమిటీ

▸▸ ఆర్డీవోకు జాబితా అందజేసిన ఆందోళనకారులు



మత్స్యకార కమిటీ జాబితాను ఆర్డీవో రమణకు అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న రాజయ్యపేట గ్రామ మత్స్యకారులు ఎట్టకేలకు హోం మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సూచనల మేరకు ఒక కమిటీగా ఏర్పాటయ్యారు. కమిటీగా ఏర్పాటైతే సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళతానని, రాజయ్యపేట అంటే తనకు సొంత గ్రామం లాంటిదని హోం మంత్రి అనిత చెప్పారు. దీంతో మత్స్యకారులంతా 52 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆ జాబితాను ఆర్డీవో వీవీ రమణకు ఆందోళనకారులు అందజేశారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత, కలెక్టర్‌లకు తెలియజేసి, సీఎం చంద్రబాబును కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత వీసం రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పిక్కి తాతీలు, సీఐలు జే మురళి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ఎలమంచిలి గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



పాయకరావుపేటలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న ఎంఈఓ-2 రమేశ్‌బాబు

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పట్టణం, మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఎంఈఓ-2 రమేష్‌బాబు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఎంఈఓ-2 రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెంకే గోవిందు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు. మండలంలోని వెంకటనగరం పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసూనాంబ, అపర్ణ, దొర, హరికృష్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

గ్రంథాలయ వారోత్సవాలను విశ్రాంత ప్రధానోపాధ్యాయిని కె కుసుమ కుమారి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి శైలజా రాణి, గ్రంథాలయాధికారి ఎల్వీరమణ, బి కోటేశ్వరరావు, వై బంగార్రాజు, నాయుడు పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలోని మునగపాక, గణపర్తి శాఖా గ్రంథాలయాలతో పాటు గవర్ల అనకాపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయా వేడుకల్లో గ్రంథాలయాధికారి కె.వరలక్ష్మి, పెంటకోట తులసీరావు, ఆళ్ళ మహేశ్వరరావు, పొలమరశెట్టి ఆనంద్‌రావు, రామలక్ష్మి, ఆళ్ళ సూరిబాబు, రాము పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని దిమిలి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వార్సోవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి వైఎస్ ఎంపీపీ కొటాపు లక్ష్మి, దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు, దిమిలి హైస్కూల్ హెచ్‌ఎం శాస్త్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్. ప్రసాద్, నాయుడు, ఎల్ఐసీ అప్పారావు, గ్రంథాలయాధికారి జి ఎస్. శకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

విద్యార్థులు చిననాటి నుంచే గ్రంథ పఠనం అలవర్చుకోవాలని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాధికారి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.భాగ్యవతి, బి. సాంబశివరావు, ఆడారి పూరి జగన్నాథం, వనుం నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

సమాజానికి గ్రంథాలయం దేవాలయం వంటిదని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయనిక్కడ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామరావు హైస్కూల్ టీచర్ ప్రసాద్, గ్రంథాలయాధికారి అప్పల రాజుబాబు పాల్గొన్నారు.

సందడిగా బాలల దినోత్సవం



పాయకరావుపేట గౌతమ్ స్కూల్లో వివిధ వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందోత్సాహాలు నడుమ జరుపుకున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఎస్ఎస్ఎల్‌డీ. భవానీ, మల్లిపాటి సత్యనారాయణ తదితరులంతా కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్, వనిత క్లబ్ ప్రతినిధుల ఆర్థిక సాయంతో విద్యార్థులకు పుస్తక సామగ్రిని అందజేశారు. అదేవిధంగా కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వైవీ. రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి గర్ల్స్ హైస్కూల్, జడ్పీ హైస్కూల్, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, వేంపాడు, డీఎల్‌పురం, జానకయ్యపేట, ఉద్దండపురం, పెదబొదిగల్లం, రాజయ్యపేట, దేవవరం పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అచ్యుతాపురంలో..

చిల్డ్రన్స్ డే వేడుకలు మండలంలో పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. భవానీ విద్యానికేతన్‌లో పిల్లలు ఫ్యాన్సీ డ్రస్ ప్రదర్శనలతో పాటు నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కూండ్రపు సంతోష్ కుమార్, మారిశెట్టి వెంకట రమణ, కె. మూర్తిప్రసాద్, కె.లత, సుశ్మ, సీహెచ్ భారతి, రూప, ఆలేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం ప్రశాంతి పూలమాల వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, భవాని, రజియ, కరుణ, శ్రీను, అప్పలనాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని జల్లూరు, కోటవుటర్ల, పాములపాక హైస్కూళ్లలో భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌మూర్తి, లక్ష్మీనారాయణ, ఎస్. సుకుమార్‌లు నెహరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'నాటక రంగానికి వీరునాయుడు సేవలు శ్లాఘనీయం'



వీరునాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

మునగపాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రంగస్థల దర్శకుడు, రచయిత, నటుడు స్వర్గీయ వెలగా వీరునాయుడు నాటక రంగానికి అందించిన సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక నందీశ్వర ప్రాంగణం తులసీ కళావేదికపై స్వర్గీయ వీరునాయుడు సంస్మరణ సభ శుక్రవారం రాత్రి నిర్వహించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏటా వీరునాయుడు కుమారుడు శ్రీనివాసరావు నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన శిష్యులు, అభిమానులు బొడ్డేడ ప్రసాద్, దాడి మునిలినాయుడు, బద్దెం సూర్యనారాయణ, ఆడారి మంజు, సూరిశెట్టి రాము, దిమ్మల అప్పారావు మాట్లాడారు. అనంతరం గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

చిన్నారికి అరుదైన లివర్ వ్యాధి

వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు



చిన్నారికి ఎన్‌వోసీ పత్రాలను అందజేస్తున్న చలపతిరావు

ఎలమంచిలి/అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 10 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు ఎన్‌ఓసి పత్రాలను మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు అందజేశారు. అచ్యుతాపురం మండలం ఖాజీపాలెం గ్రామానికి చెందిన అప్పికొండ నాయుడు కుమారుడు రిషి దుర్గకు అరుదైన లివర్ సంబంధిత వ్యాధి రావడంతో పలు ఆస్పత్రులకు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రిలో లివర్ మార్పి అవసరమని, రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తేల్చి చెప్పారు. దీంతో తల్లి హైమ తన లివర్‌ను ఇవ్వడానికి అంగీకరించినా లక్షలాది రూపాయలు లేక స్థానిక నేతలతో కలిసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును కలిసి తమ కుమారుడి పరిస్థితిని వివరించారు. ప్రగడ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సీఎం సహాయనిధి నుంచి 10 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ఎన్‌ఓసీ పత్రాలను శుక్రవారం బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్, యాదక కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు, మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, లాలం భరత్, కాపు కార్పొరేషన్ డైరెక్టరు మామిడి అప్పారావు పాల్గొన్నారు.

బిహార్‌లో విజయంతో బీజేపీ శ్రేణుల సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అచ్యుతాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించడంతో స్థానిక బీజేపీ శ్రేణులు శుక్రవారం సాయంత్రం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, నేతలు అగ్గాల హనుమంతరావు, జీవీఎస్ రాజు, పల్లి రాజాబాబు, వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

మధుమేహం పట్ల అప్రమత్తంగా ఉండాలి

▸▸ డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీర జ్యోతి

కోటవురట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీర జ్యోతి అన్నారు. శుక్రవారం రాట్నాలపాలెం హెల్త్‌సెంటర్‌ను ఆమె సందర్శించారు. ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధుమేహం రాకుండా ఉండాలంటే ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. రైస్ ఎక్కువగా తినకూడదని, ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తినాలన్నారు. ఈసమావేశంలో డాక్టర్ ప్రత్యూష్, ఎంపీహెచ్‌వో బుల్లిబాబు, బెన్నయ్య పాల్గొన్నారు.

'వివాహమైన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వండి'

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతు కుటుంబాల్లో వివాహమైన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలని మూలపర్ర గ్రామానికి చెందిన మహిళా రైతులు కోరారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రమణ, తహశీల్దార్ నర్సింహమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. భూములున్నాయని తమ ఆడపిల్లలకు వివాహాలు చేశామని, భూములు పోతే, తాము ఆడపిల్లలకు ఏవిధంగా న్యాయం చేయగలమని ఆవేదన వెలిబుచ్చారు. పెళ్లయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.

'స్వామిత్వ సర్వే సక్రమంగా నిర్వహించాలి'



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి

ఎస్.రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వేను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని చిన గుమ్ములూరు, పెనుగొల్లు గ్రామాల్లో శుక్రవారం డీఎల్‌పీవో పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి కొలతలను శాస్త్రీయ పద్ధతిలో కొలిచి ఆయా ఇళ్ల వివరాలను ఇంటి యజమాని పేరుతో హక్కు పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఈఓగా సూర్యప్రకాశ్ బాధ్యతల స్వీకరణ

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మండల విద్యాశాఖ అధికారిగా శుక్రవారం ఎస్.సూర్యప్రకాశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ని ఉపాధ్యాయ సంఘం నేత బొడ్డేడ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు



చెక్కులను పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రసాదరాజు, బ్యాంకు అధికారులు

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులంతా పీఎం స్వానిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం బరోడా బ్యాంకు ఆవరణలో 84 మంది వీధి వ్యాపారులకు రూ.12 లక్షల మేరకు రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలను వ్యాపారులు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బరోడా బ్యాంకు మేనేజరు శ్రీనివాసరావు, మెప్మా సిటీ మేనేజరు పద్మావతి, బ్యాంకు అధికారులు, మెప్మా డీఎంసీ వరలక్ష్మి, సీఓలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

▸▸ డీఎల్‌డీఓ ఇ.నాగలక్ష్మి

పాయకరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇంటి పన్నులను శతశాతం వసూలు చేయాలని డీఎల్‌డీఓ ఇ.నాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పాత బకాయిలతో సహా ఇంటి పన్నులు వసూలు ముమ్మరం చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, సంపద తయారీ కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీ ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారం జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ హాల్ట్ మంజూరు

ఎస్.రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జంక్షన్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల హాల్ట్ మంజూరైందని టీడీపీ నేత సోమిరెడ్డి రాజు తెలిపారు. అలాగే కర్రివానిపాలెం నుంచి నర్సీపట్నం, పాయకరావుపేటకు రెండు బస్సులు నడుపుతారన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఇచ్చిన వినతి మేరకు వీటిని మంజూరు చేశారన్నారు. అనకాపల్లి ఆర్టీసీ డిపో సీఐ గౌరి ధర్మవరం అగ్రహారం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల స్టాప్ ఏర్పాటు చేస్తామని, ఎలక్ట్రికల్ బస్సులు వచ్చిన వెంటనే ఆయా గ్రామాలకు నడపడం జరుగుతుందని ఎండార్స్‌మెంట్ ఇచ్చారన్నారు.

'దేశంలో ఉన్నత విద్యకు ఆద్యుడు నెహ్రూ'



నెహ్రూ విగ్రహం వద్ద డీసీసీ అధ్యక్షుడు సుబ్బన్న తదితరుల నివాళి

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఇక్కడి నెహ్రూచౌక్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవభారత రూపశిల్పి నెహ్రూ దేశంలో ఐఐటీ, ఐఐఎంలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యకు ఆద్యుడుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మలపురెడ్డి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తుట్టా రమణ, సేనాపతి ఈశ్వరరావు, కె.నూకఅప్పారావు, బోయిన భానుమూర్తియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని శిక్షించాలి



కశింకోటలో ఆందోళన చేపడుతున్న ఐద్వా ప్రతినిధులు

కశింకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిన్నారిపై అనుచిత ప్రవర్తనకు పాల్పడిన పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్‌పై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కశింకోటలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా చట్టాలు సమగ్రంగా అమలు కాకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇటువంటి వారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.తారక, ఎం.సత్యవతి, కె.లక్ష్మి, కె.అప్పలనర్స, టి.నూకరత్నం, టి.భవానీ, కె.ధార్మిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి భారీ విజయంపై బీజేపీ సంబరాలు



నెహ్రూచౌక్ కూడలిలో విజయోత్సవాన్ని జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కొత్తూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలిలో సంబరాలు జరుపుకున్నారు. తొలుత విజయోత్సవ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి ప్రజలు జేజేలు కొడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే దేశంలో ఎప్పుడు ఎక్కడ ఏ ఎన్నికలు జరిగిని పార్టీ విజయభేరి మోగిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి'



బోరు ఏర్పాటుకు శంకుస్థాపనలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

లంకెలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. గొడ్డుపేటలో శుక్రవారం తాగునీటి బోరు ఏర్పాటుకు శంకు స్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు యర్రా కోటేశ్వరరావు, కర్రి అప్పారావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంస్థలో సభ్యులకు మెరుగైన సేవలు



జెండాను ఆవిష్కరణలో చైర్మన్ గండి దేముడు తదితరులు

సబ్బవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దుర్గమాంబ పీఏసీఎస్‌లో శుక్రవారం 72వ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ చైర్మన్ గండి దేముడు కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం సంస్థ ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో గొంప రమణ, డైరెక్టర్లు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావు తదితరులతో పలువురు రైతులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తులు

అనకాపల్లి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి కౌసల్ వికాస యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణాధికారి జి.మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా పది లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించినట్టు డీటీఓ పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డీపీఆర్ నకళ్లను, ఇతర అటాచ్‌మెంట్లను స్థానిక జిల్లా రవాణాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇందుకు కావాల్సిన అర్హతలు, ఆసక్తి గల సంస్థ ఎన్జీఓ, ట్రస్ట్, కో-ఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు ఫార్మ్ అయి ఉండాలన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

- పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటాలకు నివాళి
- విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన వక్తలు



తేగాడలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సూర్యలక్ష్మి

కశింకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కశింకోట మండలం తేగాడ కేజీబీవీలో జరిగిన ఈ వేడుకకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి ఎన్.సూర్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతేకాకుండా వీరికి విద్య, స్వేచ్ఛ, రక్షణ కల్పించాలన్నారు. బాలలకు సంబంధించి ఏదైనా అత్యవసరమైతే ఉచిత హెల్ప్ లైన్ నంబర్లు 1098, 112, 181, 100లను వినియోగించుకోవాల్సిందిగా ఆమె సూచించారు. మిషన్ కో-ఆర్డినేటర్ కె.మేరీ సువార్త మాట్లాడుతూ పిల్లలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించే విధంగా తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ డి.చంద్రకళ, అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, జిల్లా బాలల సంరక్షణ విభాగం రక్షణ అధికారి కె.ఎల్.మనోహర్, లీగర్ ఆఫీసర్ రమాదేవి, కౌన్సిలర్ భాను, సామాజిక కార్యకర్త రూప తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. పాఠశాలల ప్రాంగణాల్లో చిన్నారులకు నెహ్రూ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు. అనం తరం చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు.



సబ్బవరం మండలం గొటివాడ ప్రాథమిక పాఠశాలలో..

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలోని గొటివాడ, మొగలిపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీటీసీ బొండా సత్యారావు, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, నీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు.

అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శిరీషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వరప్రసాద్, హెచ్ఎం పీవీ ఆనంద్, పలువురు ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

- టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 'పీలా'

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఇక్కడి తన కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం అమలుపరుస్తున్నామని చెప్పారు. పాసు పుస్తకాల కోసం పలువురు రైతులు పీలాకు వినతి పత్రాలు అందజేశారు. తహశీల్దార్‌తో మాట్లాడి తక్షణమే మంజూరు చేయాలని కోరారు. కశింకోట మండలం ఏనుగుతునిలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, కొంతమందికి స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని, అలాగే పలు ప్రాంతాలవారు రోడ్లు, కాలువలు నిర్మించాలని, పింఛన్లు అందించాలని ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. వీటిని ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, కాండ్రేగుల సత్యనారాయణ, పోలారపు త్రినాథ్ తదితరులు పాల్గొన్నార



అర్జీని స్వీకరిస్తున్న పీలా పీలా గోవింద్

విజ్ఞాన వేదికలు గ్రంథాలయాలు

- వారోత్సవాల్లో వక్తలు



అనకాపల్లి శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో పెంటకోట అపర్ణ ప్రారంభించారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముందుగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే వేదికలుగా పేర్కొన్నారు. వీటిని అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. జూనియర్ వెటర్నరీ అధికారి సిహెచ్.కరుణశ్రీ, గ్రంథాలయాధికారి కె.జగన్నాథంలతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం పరవాడ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి వక్తలు ఎం.సన్యాసిరావు, పి.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి కె.వెంకటరమణ, దామోదరరావు, జంగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వక్త



సబ్బవరం మండలం గొటివాడ ప్రాథమిక పాఠశాలలో...

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఇక్కడ ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈవో-2 రవీంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ప్రతి విద్యార్థి రోజూ గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకో వచ్చునన్నారు. గ్రంథాలయాధికారిణి వి.శిరీషా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వార్డు మెంబరు కొల్లి కృష్ణ, ఉపాధ్యాయలు విజయ, వీకేవీ లక్ష్మి, ప్రసాద్, ఆర్.నాగేశ్వరి, బేబీ రాణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడలో ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

- గండివారి వీధి, బొంకుల దిబ్బ, మండల పరిషత్ కార్యాలయం కూడలి సమీపంలో గత ఏడాది ఏర్పాటు
- రేడియం స్టిక్కర్లు, రంగులు వేయకపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



గండివారి వీధి సమీపంలో వేసిన స్పీడ్ బ్రేకర్

పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలోని గండివారి వీధి, బొంకుల దిబ్బ, మండల పరిషత్ కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించాలన్న ఆలోచనతో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు గత ఏడాది ఏర్పాటు చేశారు. అయితే వీటికి రంగులు వేయకుండా ఇలాగే వదిలేశారు. ఇవి కొంత ఎత్తుగా ఉండి, రేడియం స్టిక్కర్లు, రంగులు లేకపోవడంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఇక్కడ ఇటువంటి సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని అంటున్నారు. వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తుండడంతో వాటి నుంచి రక్షించుకునేందుకు వేగంగా వెళ్తూ పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.



బొంకులదిబ్బ వీధి సమీపంలో...

నేడు లక్ష్మీదేవిపేటలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



లక్ష్మీదేవిపేటలో కొలువుదీరిన గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని లక్ష్మీదేవిపేటలో కొలువుదీరిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవంలో భాగంగా రాత్రికి అతి పవిత్రతో ఉపవాస దీక్ష ఆచరించే భక్తులు శూలాల మహోత్సవం నిర్వహిస్తా రని కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత్రి ఏడు గంటల నుంచి నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా వెంకటరమణ



వెంకటరమణ

పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల శాఖ అధ్యక్షుడిగా తానాం గ్రామానికి చెందిన కన్నూరు వెంకటరమణ ఎన్నికయ్యారు. గురువారం సబ్బవరంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు మండల కమిటీ ఎన్నికైంది. ఉపాధ్యక్షుడిగా సారిపల్లి జోగినాయుడు, ప్రధాన కార్యదర్శిగా జనపాల రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆర్సి అప్పా రావు, బండారు సన్యాసినాయుడు, గొర్లి సన్యాసినాయుడు, కార్యదర్శులుగా కూండ్రపు అప్పారావు, అర్జిల్లి అప్పారావు, పైలా చిన అక్కునాయుడు, ట్రెజరీగా సోమునాయుడులను ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

మత్తు పదార్థాల వాడకంతో జీవితం చిత్తు : ఎస్ఐ



పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ భీమరాజు సూచించారు. శుక్రవారం ఇక్కడున్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మత్తు పదార్థాల వలన జీవితాలు నాశనమవుతాయన్నారు. మహిళల భద్రత, హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

సబ్బవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరిపాక శివారు టిక్కలిపాలెం దరి చెరకు కాటా వద్ద గల షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ నిర్మాణకర్త, మాజీ ఎంపీటీసీ మల్ల కోటేశ్వరరావు తెలిపారు. వేకువజాము ఐదు గంటల నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. మహిళలకు కోలాటం పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం అన్నసమారాధన జరపనుననట్టు చెప్పారు.

భారీ లోడుతో వెళుతున్న లారీకి రూ.50 వేల జరిమానా

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి పిక్కను లోడ్ చేసుకుని వెళుతున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపిన వివరాలివి. ఇక్కడి జాతీయ రహదారిలోని నూకాంబిక ఆలయ ముఖద్వారం వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఇంతలో విశాఖ మార్గం నుంచి పూడిమడక రోడ్డుకు వచ్చే అధిక లోడు లారీని ఆపి పరిశీలించామన్నారు. పరిమితికి మించి లోడు ఉండడంతో ఆర్టీవో దృష్టికి తీసుకు వెళ్లగా, సదరు వాహనం యజమానికి రూ. 50 వేలు జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన వారితో కళాసీల విద్య

పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా విలువిద్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి విలువిద్య పోటీలు ముగిశాయి. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రికర్వ్, కాంపౌండ్, ఇండియా రౌండ్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు విలువిద్య సంఘం జిల్లా కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. భైరాగి నాయుడు, హర్షవర్ధన్, యశ్వంత్ నాయుడు, గణేష్, మణిరత్నం, సాంబశివ, మోహిత్ సాయి, దేశయ్య, సంతోష్, రాహుల్, ప్రణీత్‌కుమార్, ప్రశాంతరెడ్డి, హరీష్‌చంద్ర, పూర్వరాథోడ్, భాస్కర్, సాయి మనిశ్వి, మోహిత, హర్షిత, సాహితీరత్నలు ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ప్రకృతి సేద్యం విస్తరణకు కృషి

రాష్ట్ర రైతు సాధికారత సంస్థ ఈడీ బాబూరావునాయుడు

ముగిసిన క్షేత్ర సిబ్బంది ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం


మాట్లాడుతున్న బాబూరావునాయుడు

పాడేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్త రించేందుకు కృషి చేయాలని రాష్ట్ర రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి.బాబూరావు చారు. మండలంలోని డోకులూరు గ్రామంలో క్షేత్ర సిబ్బంది నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్య పద్ధతులను గిరిజన రైతులకు అలవాటు చేయడంతో, వాటిని పాటించేలా కృషి చేయాలన్నారు. ఐదు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలపై మరింత అవగాహన ఏర్పరచుకుని, వాటిపై రైతులకు తర్ఫీదు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా బీజామృతం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, తదితర బయో ఇన్‌పుట్‌ల తయారీలపై క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అలాగే రాష్ట్ర రైతు సాధికారత సంస్థ చైర్మన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.విజయ్‌కుమార్‌తో వారికి వర్చువల్‌గా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికారత సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

▸▸ పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. శుక్రవారం ఆహారం అజీర్తి కారణంగా అస్వస్థతకు గురైన జర్రెల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. కలుషిత ఆహారం తీసుకుని 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పటికీ, జిల్లా అధికారులు పాఠశాలను సందర్శించిన దాఖలాలు లేవన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ మండల అధ్యక్షుడు కె.గిరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉమానీలకంఠేశ్వరునికి రుద్రాభిషేకం

పాడేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. ఆలయ ఆధ్యాత్మిక ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. వందలాది మంది భక్తులు రుద్రాభిషేకాలతో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు రామం పంతులుస్వామి అభిషేకాలను చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎన్‌టీపీసీ డ్రోన్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు

చింతపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గొందిపాకలు పంచాయతీ పరిధిలోని రాసపనస గ్రామంలో ఎన్‌టీపీసీ అధికారులు నిర్వహిస్తున్న డ్రోన్ సర్వేను గిరిజనులు అడ్డుకున్నారు. ప్రైవేటు వాహనంలో గ్రామానికి వచ్చిన కొంత మంది ఉద్యోగులు గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు డ్రోన్‌తో సర్వే చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సాగిన వరలక్ష్మి, గిరిజనులు రాత్రి వేళ గ్రామానికి వెళ్లే సర్వే చేస్తున్న అధికారులను నిలదీశారు. డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. గిరిజన గ్రామాల్లో సోలార్, విండ్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు సర్వే చేస్తున్నామని ఎన్‌టీపీసీ ఉద్యోగులు తెలిపారు. అదే రోజు రాత్రి డ్రోన్ కెమెరాను చింతపల్లి పోలీసులకు అప్పగించారు. ఉద్యోగులు సర్వేను నిలిపివేసి వెళ్లిపోయారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. మండల కేంద్రంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

ఘనంగా బిర్సాముండా శత జయంతి వారోత్సవాలు

అరకులోయ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం బిర్సా ముండా శత జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ బిర్సాముండా జయంతి జరుపుకునే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. జాతి సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ బిర్సాముండా జయంతిని పాడేరులో నిర్వహించి, ఆదివాసీలను మభ్యపెట్టాలని ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు బాలదేవ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సీపీఎం నాయకులు రామారావు, వీవీ.జయ, గెమ్మెలి చినబాబు, గత్తుం బుజ్జిబాబు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

గిరిజనులు బిర్సా ముండా ఆశయ సాధనకు కృషి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బుర్గ పంచాయతీ మజ్జివలస గ్రామంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ ఆదివాసీలదే అని బిర్సా ముండా పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్. హైమవతి, సురేశ్, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగ్గురు బాలికలకు ఎస్‌బీఐ సైకిళ్లు పంపిణీ

అరకులోయ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం అరకులోయ స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు మెరిట్ బాలికలకు మూడు సైకిళ్లను బహూకరించారు. హైస్కూల్‌లో ఇందు(8వ తరగతి), దేవిప్రభ, రేష్మ(9వ తరగతి) బాలికలకు ఎస్‌బీఐ మేనేజర్ శ్యామ్‌కుమార్, ఫీల్డ్‌ఆఫీసరు ఉదయ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ముగ్గురు మెరిట్ బాలికలకు సైకిళ్ల పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మోహనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీపేట పంచాయతీని పెదబయలులోనే కొనసాగించాలి

పెదబయలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):పెదబయలు మండలంలోనే లక్ష్మీపేట పంచాయతీని కొనసాగించాలని మండల వైస్ఎంపీపీ పాంగి సోనే, సర్పంచ్ లకే అశోక్‌కుమార్, మండల పీఏసీఎస్ చైర్‌పర్సన్ ప్రసాదరావు, 14 గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏలో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు, పెదబయలు తహశీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదబయలు మండలంలోనే తమ పంచాయతీ ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉందన్నారు. గోమంగి మండలంలో లక్ష్మీపేట పంచాయతీని విలీనం చేసినట్టయితే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అందువల్ల పెదబయలు మండలంలోనే కొనసాగించాలని పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. గోమంగి మండలంలో తమ పంచాయతీని విలీనం చేసినట్టయితే ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

▸▸ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్.లోకేశ్వరరావు

▸▸ ఐటీడీఏలోని పీజీఆర్ఎస్‌కు 121 వినతులు


పీజీఆర్ఎస్‌లో సమస్యలు వింటున్న ఆర్డీవో ఎంవీఎస్.లోకేశ్వరరావు

పాడేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్.లోకేశ్వరరావు ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, స్వయంగా విచారణ చేపట్టి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చిన గిరిజనుల నుంచి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్. లోకేశ్వరరావు, గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్ 121 వినతులను స్వీకరించారు. హుకుంపేట మండల కేంద్రంలోని రోడ్ల ఆక్రమణలు తొలగించాలని, ఎంపీడీవో కార్యాలయంలోని సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గోడ్వానా దండకారణ్య పార్టీ జిల్లా కార్యదర్శి చుంచు రాజబాబు ఫిర్యాదు చేయగా, పెదబయలు మండలం బొడ్డగొంది గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని పలువరు కోరారు. అలాగే కొయ్యూరు మండలం యూ.చీడిపాలెంలో అంగన్‌వాడీ సేవలు సక్రమంగా అందడం లేదని పలువురు తెలపగా, తమకు తల్లికి వందనం డబ్బులు ఖాతాలో జమకాలేదని మరికొందరు వినతిపత్రాలు సమర్పించారు.

1100 కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

మీ కోసం కార్యక్రమంలో అర్జీదారులు దాఖలు చేసిన వ్యక్తులు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకుంటే 1100 నెంబర్‌కు ఫోన్ చేసి సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో లోకేశ్వరరావు పేర్కొన్నారు. అర్జీదారులు సదరు కాల్ సెంటర్ సేవలను వినియోగించుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళీ, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కృష్ణమూర్తినాయిక్, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమిళ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, గనుల శాఖ ఏడీ ఆనంద్, జాతీయ రహదారుల డిప్యూటీ తాహసీల్దార్ వి.ధర్మరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

▸▸ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంవీవీ ప్రసాద్

చింతపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జర్రెల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం జర్రెల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి ఆశ్రమ పాఠశాలలో పెరుగు తీసుకున్న 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు చెబుతున్నారన్నారు. విషయం తెలియగానే హెచ్‌ఎం, వార్డెన్ అప్రమత్తమయ్యారన్నారు. దీంతో విద్యార్థులకు జర్రెల వైద్యాధికారి ఎస్‌వీఎస్ మణిదీప్, వైద్య సిబ్బంది సకాలంలో మెరుగైన చికిత్స అందించారన్నారు. గురువారం రాత్రి వైద్యాధికారి, వైద్య సిబ్బంది వసతి గృహంలోనే విద్యార్థులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించారన్నారు. విద్యార్థులకు సకాలంలో వైద్యం అందడం వల్ల ప్రాణాపాయం తప్పిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో బి.జయనాగలక్ష్మి, హెచ్‌ఎం సింహాచలం, డిప్యూటీ వార్డెన్ రమేశ్, వైద్యాధికారులు మణిదీప్, మాజీద్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగమణి, స్థానిక నేత బేరా సత్యనారాయణపడాల్ పాల్గొన్నారు.

వాడవాడలా బాలల దినోత్సవం


దేశ నేతల వేషధారణలో అలరిస్తున్న బాలబాలికలు

పాడేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ విద్యాలయాల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.విశ్వప్రసాద్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ గొప్పతనాన్ని పిల్లలకు ఆయన వివరించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు సిహెచ్.రమాదేవి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్షర హైస్కూల్లో చిన్నారులు బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, రైతుల వేషధారణలతో ఆహూతులను ఆకర్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ డి.నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సీలేరు: సీలేరు బాలుర గిరిజన గురుకుల, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్స్‌పాల్ బుజ్జిబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగశకుంతల ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

అద్భుతం.. రంగినిగూడ జలపాత సౌందర్యం


ఎత్తయిన ప్రదేశం నుంచి పడుతున్న జలపాతం

ముంచంగిపుట్టు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల బుంగాపుట్టు పంచాయతీ రంగినిగూడ సమీపంలో ప్రవహిస్తున్న జలపాతం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఎత్తైన కొండల నడుమ రమ్యంగా ఉరకలేస్తూ ప్రవహిస్తున్న రంగినిగూడ జలపాత సౌందర్యం చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నది. ఏడాది పొడుగునా ప్రవహించడం ఈ జలపాతం ప్రత్యేకత. కనువిందు చేస్తున్న జల సౌందర్యాన్ని చూడాలంటే ముంచంగిపుట్టు మీదుగా లక్ష్మీపురం వెళ్లి.. అక్కడ నుంచి బుంగాపుట్టు మీదుగా రంగినిగూడకు 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జలపాతం వద్దకు చేరుకొనేందుకు కొంత సమయం కాలినడకన వెళ్లాలి.

మన్యాన్ని వణికిస్తున్న చలి


అరకులోయలో దట్టంగా కురుస్తున్న మంచు

అరకులోయ, నవంబరు 14 (ఆంధ్రభూమి):మన్యంలో రోజురోజుకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం నాలుగు గంటలకే చల్లటి గాలులతో చలి జనాన్ని పలకరిస్తున్నది. రాత్రి అవుతున్న కొద్ది చలి అధికం కావడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడమే కష్టంగా ఉంటుంది. అరకులోయలో శుక్రవారం 7.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది.

హుకుంపేటలో..

మండలంలో గత మూడు రోజులుగా మంచు అధికంగా కురుస్తుండడంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. శుక్రవారం ఉదయం 9గంటల వరకు మంచు వీడలేదు. దీంతో ప్రజలు చలి మంటలు వేసుకుంటున్నారు. సాయంత్రం 4గంటల నుంచి చలి ప్రారంభం అవుతుండడంతో ఎవరూ ఇంట్లో నుంచి బయటకు రావడానికి సాహసించడం లేదు. మంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.


హుకుంపేట: మంచులో లైట్లు వేసుకొని వాహనం

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి తదితరులు

పాడేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి వి.మానస రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగనాథన్ తెలిపిన ఐదు సూత్రాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎన్.రసూల్, లైబ్రరీ ఇన్‌చార్జి మణికుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ఈసందర్భంగా కనీస సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు వంటివని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దన్నేరావు, కాంగ్రెస్ నేత భాస్కరరావు, గ్రంథాలయ అధికారిణి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలులో గ్రంథాలయాధికారి కే సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కండి: ఎంపీపీ

జి.మాడుగుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులకు భాగస్వాములు కావాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబ్ల్యూ ఇంజినీరింగ్ శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అధికారులను సకాలంలో స్పందించాలని కోరారు. అలాగే రహదారుల పనులు వేగవతం చేయాలన్నారు. మండలంలో ఉపాధ్యాయులు సమయాలపాలన పాటించడం లేదని సభ్యులు తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని వారు కోరారు. సమావేశంలో తహశీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, సీడీపీవో బాలమణిదేవి, జీసీసీ మేనేజర్ బాబూరావు, ఎంఈవో-2 రమణమూర్తి, వైద్యాధికారి ఇందిరా, ఇంజనీరింగ్ అధికారులు విజయ్‌కుమార్, మాణిక్యం, స్వాతి, సంతోశ్, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, కల్యాణి ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కార్యదర్శిగా బోడా శ్యామ్

హుకుంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శిగా బోడా శ్యామ్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం అరకులోయ టీడీపీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ ఎన్నికలో గెలిచిన అభ్యర్థులతో ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మణుడు, సారి సత్యవతి, మండల అధ్యక్షుడు బొంజుబాబు, శంకర్, తులసీరావు, తదితరులు పాల్గొన్నారు

జలవిహారిలో సందడి


స్నానాలు చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో పర్యాటక ప్రాంతమైన చాపరాయి జలవిహారిలో శుక్రవారం పర్యాటకులు సందడి చేశారు. కార్తీకమాసం చివరి వారం కావడంతో మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా జలవిహారిలో స్నానాలు చేస్తు ఆనందంగా గడిపారు.

బిర్సా ముండా జయంతిని జయప్రదం చేయాలి

పాడేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి కోరారు. పాడేరు మండలంలో ఈ వేడుకల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. చింతలవీధి పంచాయతీ కేంద్రంలోని వై జంక్షన్ వద్ద బిర్సా ముండా కాంస్య విగ్రహం ప్రతిష్ఠకు ఒడిశా సీఎం హాజరుకానున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు అధికంగా హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

టెన్త్ పరీక్షా కేంద్రం పరిశీలన

సీలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అనువైన వాతావరణం ఉందా? లేదా? అని తనిఖీ చేస్తున్నామన్నారు. అలాగే విద్యార్థులకు పలు పలు సూచనలు చేశామన్నారు. గత ఏడాది కంటే విద్యార్థుల సంఖ్య పెరిగితే పరీక్షా కేంద్రాల సంఖ్య కూడా పెరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగభూషణం, నాగశకుంతల, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూళ్లను విలీనం చేయొద్దు

గూడెంకొత్తవీధి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రీ స్కూళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయవద్దని అంగన్‌వాడీ వర్కర్స్, వెల్ఫేర్ సంఘం మండల కార్యదర్శి సోమెల అప్పలనర్స డిమాండ్ చేశారు. రింతాడ పంచాయతీలో శుక్రవారం కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ స్కూళ్లను బలోపేతం చేయాలన్నారు. వీటిని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలన్నారు. ప్రీ స్కూల్ విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకం వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకులు జ్యోతి, భవానీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

పాడేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాలలో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశామని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సంగ్రామ్ జిత్ సాహో తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో అనకాపల్లి, పాడేరు, బాకూరు బ్రాంచిల ద్వారా దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినులను గుర్తించి సైకిళ్లను అందించినట్టు చెప్పారు.కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జి.అఖిల, పాఠశాల హెచ్‌ఎం మంజుల, ఎస్‌బీఐ డీఎం ఎన్.శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు

చింతపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులతో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. శుక్రవారం డేటా ఎలానసిస్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ, ఐటీఐ, పీజీ కోర్సులు చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పొందేందుకు ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. పాడేరు డిగ్రీ కళాశాల యాజమాన్యం సహకారంతో గిరిజన ప్రాంత విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం కోర్సు ట్రైనర్ కేవీ శ్రీకృష్ణను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ విరమణ, అధ్యాపకులు డి.కేజియా, ఐ.రవీంద్రనాయక్, ఈశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పాడేరు మండలంలో కలపండి

కుంతుర్ల పంచాయతీ తీర్మానం

పెదబయలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలోని అతి మారుమూల కుంతుర్ల పంచాయతీని పాడేరు మండలంలో విలీనం చేయాలని పంచాయతీ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సర్పంచ్ వంతాల కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కోరాబు జ్యోతి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల గిరిజనులు సమావేశమై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి, జీఎస్‌యూ నేత బాబూజీ మాట్లాడుతూ మండలాల విభజన జరిగినప్పుడు తమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. అప్పటి పాలకులు, అధికారులు చేసిన తప్పిదంతో ప్రస్తుతం కుంతుర్ల పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ గ్రామానికి 60 కిలోమీటర్లు దూరంలో గల పెదబయలు మండలంలో కలపడం వలన రోడ్లు, తాగునీరు, మౌలిక వసతులు లేక పంచాయతీలోని అనేక గ్రామాల గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే గోమంగి మండలంలో కలపవద్దని వారు కోరారు. పాడేరు మండలంలో తమ పంచాయతీని కలిపినట్టయితే గిరిజన గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు, ప్లేట్ల వితరణ

పాడేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముల్లుమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు శుక్రవారం కుర్చీలు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త విజయ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కృషి

▸ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాయానికి సౌర విద్యుత్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఆర్సీఎం 1983 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని కథల పుస్తకాలను పిల్లలు చదవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయానికి 100 పుస్తకాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రంథాలయ అధికారిణి దమయంతిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, విశ్రాంత గ్రంథాలయ అధికారి త్రిమూర్తులురెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ శాఖ మంత్రితో నేతల భేటీ



మంత్రిని కలిసిన బీసీ సంఘాల నేతలు, కార్పొరేషన్ డైరెక్టర్లు

చోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ నాయకులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్లు శుక్రవారం భేటీ అయ్యారు. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రికి స్వాగతం పలికిన అనంతరం, బీసీ సంక్షేమ పథకాల రుణాలకు సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి సవితను కలిసిన వారిలో మండలానికి చెందిన గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, బీసీ కమిటీ నాయకులు పూతి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా కార్తీక వన సమారాధన



కార్యక్రమంలో నృత్యం చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్

కె.కోటపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం వన సమారాధన నిర్వహించారు. దాలివలసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ మాట్లాడుతూ ఎన్నో పనుల ఒత్తిడితో ఉద్యోగులు సతమతమవుతుంటారని, కార్తీక వన సమారాధన పేరుతో ఒకే చోట కలిసి ఉల్లాసంగా గడపడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఉద్యోగులు హోదాలను మరిచి ఉత్సాహంగా గడపడం ఆనందంగా ఉందన్నారు. వివిధ రకాల ఆటలు, పాటలు, డాన్సుల్లో పాల్గొన్న ఉద్యోగులకు బహుమతులు అందజేశారు.


ఎస్ఐ తారకేశ్వరరావుకు ప్రశంసాపత్రం



ఎస్ఐ తారకేశ్వరరావును అభినందిస్తున్న జిల్లా తుహిన్‌సిన్హా

నాతవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ వై.తారకేశ్వరరావుకు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. మొంథా తుపాన్ సమయంలో ఉత్తమ ప్రతిభ కనబర్చారని, అక్టోబరులో శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. అలాగే పేద విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేయడమే కాకుండా నిరుద్యోగ యువకులకు వివిధ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాల కల్పనకు చేయూతనిస్తున్నారని ఎస్పీ కొనియాడినారు. ఈ సందర్భంగా ఎస్ఐ తారకేశ్వరరావుకు తాండవ చైర్మన్ సత్యనారాయణ, నాతవరం పీఏసీఎస్ చైర్మన్ అపిరెడ్డి మాణిక్యం, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

పోలీసుల అభ్యుదయ సైకిల్ యాత్ర



అభ్యుదయ సైకిల్ యాత్రలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతలో విస్తృత అవగాహన కల్పించడానికి విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభ్యుదయం సైకిల్ యాత్ర శుక్రవారం నర్సీపట్నం చేరుకుంది. ఈ యాత్ర పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నర్సీపట్నం మండలం ధర్మసాగరం భాష్య స్కూల్ విద్యార్థులతో ఎస్ఐ రాజారావు ర్యాలీ నిర్వహించారు. కెన్విన్ స్కూల్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐలు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

వడ్డాదిలో కుక్కలతో భయం.. భయం..



రహదారిపై గుంపులుగా ఉన్న కుక్కలు

బుచ్చెయ్యపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల ఓ పిచ్చి కుక్క కాటుకు చిన్నారులు, వృద్ధులు గాయపడిన విషయం తెలిసిందే. దీనికితోడు తాజాగా కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో జనం భయాందోళన చెందుతున్నారు. రాత్రి పూట ఒకే చోటకు కుక్కలు చేరి ఉంటుండడంతో రాకపోకలకు జనం భయపడుతున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేశ్ ఈ సమస్యను ఈవో లవరాజు దృష్టికి తీసుకువెళ్లగా, శనివారం ఏరివేత కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి కష్టపడి పనిచేయండి

తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో

బత్తుల తాతయ్యబాబు, చింతకాయల విజయ్





ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్... హాజరైన నాయకులు

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ పదవులు ఇప్పుడు రాకపోతే తదుపరి అవకాశం వారికి వస్తుంది. కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేయాలి' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. ధర్మసాగరం స్టార్ హోమ్స్‌లో తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ కొంత మందికి ప్రాధాన్యత లేకపోయినా పార్టీకి కట్టుబడి పని చేయడం ప్రసంశనీయమన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న ప్రతీ కార్యకర్తకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. తాను సీటు కోసం మూడు దఫాలుగా ప్రయత్నం చేశానని, రాక పోయినా ఏ నాడు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. గత ప్రభుత్వంలో అయ్యన్నపాత్రుడుని ఇబ్బంది పెట్టినప్పుడు లోకేశ్ తమ కుటుంబానికి భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. వైద్య కళాశాలల విషయంలో ప్రభుత్వం పీపీపీ విధానంలో ఇస్తుంటే ప్రైవేటుకు ఇస్తున్నట్టు వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎన్ఎంసీ అనుమతి లేకుండా మాకవరపాలెంలో నిర్మాణం చేసిన కళాశాలకు రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన జీవోను చూపించడం అన్యాయమని చెప్పారు. బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. మరో 15 ఏళ్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండేలా అభివృద్ధి జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ రాక్షస పాలనలో అయ్యన్న కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కంచారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

మండల కమిటీ అధ్యక్షులు వీరే..

మునిసిపాలిటీ అధ్యక్షుడిగా చింతకాయల రాజేశ్, కార్యదర్శిగా లాలం మురళీకృష్ణ, నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాల అధ్యక్షులుగా సుకల అప్పలనాయుడు, ఆర్వై పాత్రుడు, నందిపల్లి వెంకటరమణ, తారక వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు 1800 మంది అనుబంధ, గ్రామ కమిటీలు, బూత్, క్లస్టర్, యూనిట్, వార్డు ఇన్‌చార్జులు ప్రమాణ స్వీకారం చేశారు.

కన్నులపండువగా దీపోత్సవం

చోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో 71 వేల దీపాలను భక్తులు వెలిగించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి సారథ్యంలో అర్చకులు భక్తులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దీపాలు వెలిగించారు. ఈ దీపోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివలింగం, వివిధ ఆకృతులతో దీపాలను వెలిగించడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, సకురు కోటేశ్వరరావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







కార్తీక దీపోత్సవం సందర్భంగా శివస్తోత్రాలతో భక్తులు వెలిగించిన దీపాలు... (ఇన్‌సెట్‌లో) దీపోత్సవం తిలకిస్తున్న ఎమ్మెల్యే రాజు

నానో యూరియాను వినియోగించాలి

గొలుగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పంటల సాగు కోసం రైతులు నానో యూరియాను వినియోగించాలని నర్సీపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీదేవి సూచించారు. మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో శుక్రవారం రైతులతో ఆమె మాట్లాడారు. 50 కిలోల యూరియా బస్తా అర లీటర్ సీసాలోకి వచ్చే నానో టెక్నాలజీని ఉపయోగించి తయారు చేసినట్టు తెలిపారు. ఒక ఎకరా పంటకుగాను అర లీటర్ సీసా యూరియాను పిచికారీ చేయాలన్నారు. దీంతో పంట ఏపుగా ఎదుగుతుందని ఆమె తెలిపారు. పురుగు మందుల వాడకం డ్రోన్‌తో చేపడితే ఖర్చు తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధారాణి, సిబ్బంది కిశోర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోస్టును ఢీకొట్టిన లారీ

▸ తప్పిన ప్రమాదం

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదబొడ్డేపల్లి కూడలిలో ట్రాఫిక్ పోస్టును కలప లారీ బలంగా ఢీ కొట్టింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో దిమ్మ మీద నుంచి ట్రాఫిక్ పోస్టు రోడ్డుపైకి పడింది. అయితే ఆ క్షణంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి తీసుకున్నారు. పోలీసులు లారీని అదుపులోకి తీసుకున్నారు.

రామునాయుడుకు సీపీఐ నాయకుల నివాళులు

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడుకు పలువురు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలో బ్యాంక్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు సిహెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్‌బాబు, సీపీఐ నాయకులు బాలేపల్లి వెంకటరమణ. జి.రాధాకృష్ణ, మాజీ నాయకుడు రజాక్ తదితరులు రామునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా తమరాన వెంకటరమణ



రోలుగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా జానకిరాంపురం గ్రామానికి చెందిన తమరాన వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో వెంకటరమణ సర్పంచ్‌గా, మండల అధ్యక్షుడిగా, గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పిల్లలను తప్పనిసరిగా గ్రంథాలయాలకు పంపండి

▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను తప్పనిసరిగా గ్రంథాలయాలకు పంపించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే రాజుతో పాటు గ్రంథాయ సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీరామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు గ్రంథాలయాలకు వెళ్లే అలవాటును పెద్దలు ప్రోత్సహించాలని సూచించారు. పుస్తకపఠనం ద్వారా మాత్రమే పిల్లల్లో విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీరామమూర్తితో పాటు ఎమ్మెల్యే రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గూనూరు మల్లునాయుడు, కందర్ప రమణమూర్తి, సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, ఎర్రంశెట్టి చిన్న, సేనాపతి శ్రీనివాసరావు, టి.శ్రీను, టి.రమణ, దొడ్డి కిశోర్, సర్పంచ్ బండి నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు కొట్టాపు రూపాదేవి, గ్రంథాలయాధికారిణి జి.తిరుమలకుమారి, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

అలాగే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎస్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, లైబ్రేరియన్ మాల్యాద్రి, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీ పరీక్షలను నిర్వహించారు.

చక్కగా చదువుకుంటేనే ఉన్నత స్థాయికి...

▸ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రాజేశ్వరి

రావికమతం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి ఆలోచనలతో చక్కగా చదువుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుతారనిరావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రాజేశ్వరి చెప్పారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళాభివృద్ధి, బాలల సంరక్షణ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్నికం జడ్పీ పాఠశాల, కేజీబీవీ విద్యాలయాల్లో శుక్రవారం మండల స్థాయి బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉన్నత స్థానంలో నిలవా లంటే విద్యార్థులు విద్యలో రాణించాలన్నారు. అలాగే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాట తప్పనిసరిగా వినాలన్నారు. ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పి.మంగ, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి భాను, పాఠశాల హెచ్ఎం, మహిళా పోలీస్, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.



గర్నికం కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

ఉత్సాహంగా బాలల దినోత్సవం



నర్సీపట్నంలో విచిత్ర వేషధారణలో విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీటీ క్లబ్ ఆవరణలో వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిల్లల విచిత్ర వేషధారణ వీక్షకులను ఆకట్టుకుంది. సినిమా, జానపద పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా డాన్సులు చేసి అలరించారు. పిల్లలు మట్టి, కాగితం ఆకృతులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, కార్యదర్శి జీవీ.రమేశ్, అల్లు అప్పారావు, బాబీ మాస్టారు, కురచ రమణ పాల్గొన్నారు. అలాగే స్టార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డేను ఘనంగా నిర్వహించారు. శారదానగర్‌లోని వేదిక ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి వి.వినోద్‌బాబు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లల పండగ ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బీఎస్ఆర్ శర్మ, సెక్రటరీ వి.నాగిరెడ్డి, ట్రెజరర్ రాము పాల్గొన్నారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చోద్యం పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసిన ఉపాధ్యాయులు

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం చిన్నారులు పలు వేషధారణలతో అలరించారు. ఎర్రవరం, గొలుగొండ, చీడిగుమ్మల, పాకలపాడు, కొత్తఎల్లవరం, గుండుపాల, కొత్తమల్లంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సమస్యలపై సచివాలయంలో ఉద్యోగులకు వినతిపత్రాలు అందించారు.



ఎర్రవరం అంగన్‌వాడీ కేంద్రంలో వేషాధారణలతో అలరిస్తున్న పిల్లలు

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: చోద్యం, లింగంపేట, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, నాగాపురం విద్యాలయాల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చోద్యం, ఏఎల్‌పురం హైస్కూల్‌లో నెహ్రూ విగ్రహాలు, చిత్రపటానికి ఎంఈవో-2 కృష్ణప్రసాద్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేశారు. అలాగే పలువురు దేశ నాయకులు వేషధారణతో పాటు ఆటల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు రాజులునాయుడు, సత్తిబాబు, ఉపాధ్యాయులు లోచల రమేష్, టీవీ రమణ, అచ్చిబాబు, చిటికెల రమణ, ఈశ్వరి వాసు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. దాలివలస, సింగన్నదొరపాలెం, గొల్లలపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో సీడీపీవో లలితకుమారి పాల్గొని అక్కడ చిన్నారులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎల్‌బీ సుశీల, ఎస్.అనిత, ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

ప్రతినిధుల ప్రవేశం..







మెటల్ డిటెక్టర్‌తో చెకింగ్



ప్రాంగణంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సదస్సు సూపర్ సక్సెస్



ప్రధాన వేదిక నుంచి అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప రాష్ట్రపతి రాధా కృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్



పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



విదేశీ ప్రతినిధితో సీఎం కరచాలనం, చిత్రంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



సదస్సు ప్రాంగణంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్



స్టాల్స్‌లో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్



ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద పారిశ్రామికవేత్తలు



పెట్టుబడులపై ప్రతినిధుల చర్చలు



అరకు కాఫీ రుచిని ఆస్వాదిస్తున్న అతిథులు



స్టాల్స్‌లో ఆహారపదార్థాలను రుచి చూస్తూ...



సదస్సులో భోజనాల సందడి



సదస్సులో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు, ప్రజా ప్రతినిధులు



సదస్సు ప్రాంగణంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, తదితరులు

దిగ్గజాలకు 'కళా' స్వాగతం



గిరిజన సంప్రదాయ థింసా నృత్యంలో మంత్రులు సవిత, సంధ్యారాణి



కళాకారుల కొమ్ము నృత్యం

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) వ్యాపార భాగస్వామ్య సదస్సు-2025 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏయూ నీరింగ్ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన సదస్సులో 40 దేశాల నుంచి సుమారు మూడు వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. వ్యాపార దిగ్గజాలు, డెలిగేట్స్‌కు వేదిక ప్రవేశం వద్ద రాష్ట్రంలోని కళాకారులు సంప్రదాయ కళలతో స్వాగతం పలికారు. అరకు గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం అలరించింది. మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, సవిత గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యంతో సందడి చేశారు. భద్రాచలం కళాకారులు కొమ్ముతో తయారుచేసిన వాయిద్యంతో కొమ్ముబూర సంగీతం వినిపించగా విదేశీయులు కళాకారులతో ఫొటోలు దిగారు. అమలాపురం కళాకారులు ప్రాచీన జానపద నృత్యాలతో అలరించారు.



బ్యాటరీ వాహనంలో ప్రతినిధులను తరలిస్తున్న దృశ్యం

నిర్వహణ అదుర్స్... వసతులు శభాష్!

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సులో డెలిగేట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత మెరుగైన వసతులు కల్పించింది. ఏయూ రోడ్డులో వేదిక వద్దకు వెళ్లడానికి 200 మీటర్ల ముందే డెలిగేట్స్ వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది హాల్స్, మూడు ప్రవేశమార్గాలు ఏర్పాటు చేశారు. ప్రవేశ మార్గంవరకు డెలిగేట్స్ నడిచివెళ్లకుండా బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచారు. సదస్సుకు వచ్చే వారి కోసం ఫైవ్‌స్టార్ స్థాయిలో వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. సిబ్బంది నిరంతరం పరిశుభ్రంగా ఉంచారు. పొగ సేవించే వారి కోసం అక్కడే స్మోకింగ్ జోన్ కేటాయించారు. డెలిగేట్స్ ఆహారం విషయంలోను ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. డెలిగేట్స్, మీడియా, అధికారులు ఇలా మూడు విభాగాలుగా విభజించి, అనేకరకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

వివిధ జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరు

పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 బాల బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఇక్కడి ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీవీఈఓ) ఉమారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరుకాగా, తొలుత ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ పుష్పలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో పి.మురళీధర్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమా, బి.శంకర్, రాంబాబు, తరుణ్, సంస్కృతి గ్లోబల్ స్కూల్ స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు, నాయకులు గొర్లి గోపి, వియ్యపు చిన్న పాల్గొన్నారు.

ఆరంభం అదిరింది

... 5వ పేజీ తరువాయి

పది రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. వాహన రాకపోకల నుంచి అతిథి మర్యాదల వరకు అన్నీ సజావుగా సాగాయి. వచ్చిన వారికి రుచికరమైన వంటకాలు వడ్డించారు. బీ టు బీ సమావేశాలు, సెషన్లు నిర్వహించడానికి ఏర్పాటుచేసిన వేదికలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఏపీ పెవిలియన్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

చంద్రబాబు, లోకేశ్ వేర్వేరుగా సమావేశాలు

సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఇద్దరూ వేర్వేరుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఒప్పందాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తో కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పియూష్ గోయల్ పక్కనే ఉండి పలు ప్లీనరీల్లో పాల్గొన్నారు. ఇద్దరూ కలిసి స్పేస్, డ్రోన్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరికీ డ్రోన్ అవసరం అవుతుందని, ఇది ప్రధాని మోదీ విశ్వాసమని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త సోమనాథ్ మాట్లాడుతూ స్పేస్ సిటీ ఏర్పాటు సీఎం చంద్రబాబు కల అని, ఇది ఇలా సాధ్యమైందని పేర్కొన్నారు.

పర్యాటకంలో 100 ఒప్పందాలు

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం రాత్రి సదస్సు ప్రాంగణాన్ని సందర్శించి తొలిరోజు సదస్సు విజయవంతమైనందుకు హర్షం వ్యక్తంచేశారు. పర్యాటకంలో 100 ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించనున్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక వెనకడుగు వేసిన పారిశ్రామికవేత్తలంతా తాజాగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు.

'పెద్దేరు' నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. గతంలో, ఇటీవల తుఫాన్ కారణంగా వర్షాలు కురవడంతో జలాశయం ఎగువ ప్రాంతం, పరిసర ప్రాంతాల్లోని కొండవాగుల ద్వారా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. దీంతో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికీ కొండవాగుల నుంచి జలాశయంలోకి నీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం సాయంత్రానికి 136.80 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 203 క్యూసెక్కులుగా నమోదైంది. నీటిమట్టం గరిష్ఠస్థాయి చేరువవుతున్నందున రాత్రి తొమ్మిది గంటల సమయంలో జలాశయం మూడో గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని పెద్దేరు నదిలోకి విడిచి పెట్టినట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



మునసబు బంగ్లాకు ఆనుకొని పార్కింగ్ చేసిన వాహనాలు

... 5వ పేజీ తరువాయి

అధికంగా వుంది. చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్సలతో పాటు ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే అక్కడ భారీ సంఖ్యలో వాహనచోదకులు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి వివిధ పనుల పై విశాఖనగరానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. అయితే వాహనాలకు ఎవరూ కాపాలా లేకపోవడాన్ని గమనించిన ద్విచక్ర వాహనచోదకులు తమకు నచ్చిన బైక్‌లను అపహరించుకుపోతున్న సంఘటనలు లేకపోలేదు. దీంతో వాహనచోదకులు పోలీసులను ఆశ్రయించాల్సి వస్తుంది.

అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద బుకింగ్ ఆఫీసు ముందు భాగంలో జీవీఎంసీ స్థలంలో ఉన్న ఆక్రమణలను జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, టీపీవో ఓ.వరప్రసాద్ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం తొలగించారు. రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటరు పక్కన ఉన్న వాహనాల పార్కింగ్ స్థలాన్ని రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా మూసివేశారు. రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్డు వైపు వాహనాల పార్కింగ్ కోసం ఆరు నెలల కాలానికి కాంట్రాక్టర్‌కు అద్దెకు ఇచ్చారు. అయితే ఇటీవల వరకు బుకింగ్ ఆఫీసు పక్కన పార్కింగ్ స్థలంలో వాహనాలు పెట్టే వారు.. ఇప్పుడు జీవీఎంసీ అధికారులు తొలగించిన దుకాణాల స్థలాల్లో వాహనాలు పెడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది రోజూ ఉదయం ఇక్కడి నుంచి విశాఖ వెళ్లి, సాయంత్రం తిరిగి వస్తుంటారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన ద్వారం ముందు ఖాళీ ప్రదేశంలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో కాంప్లెక్స్‌లోకి వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి ఔట్‌గేటు పక్కన పార్కింగ్ స్థలం వుంది. ఇక్కడ అయితే పార్కింగ్ ఫీజు చెల్లించాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ప్రధాన మార్గంలో పార్కింగ్ చేస్తున్నారు. ఇంకా భీమునిగుమ్మం పాఠశాల ముందు ఖాళీ స్థలంలో, దాసరిగెడ్డ రోడ్డులోని సత్తెమ్మతల్లి ముఖద్వారం వద్ద, మునసబుగారి బంగ్లా పక్కన వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆయా మార్గాల్లో భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రైల్వే స్టేషన్ వద్ద ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంపై ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా జీవీఎంసీ అధికారులు ఖాళీ చేయించిన బడ్డీల ప్రదేశంలో వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారని, దీనిపై జీవీఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ గేటు వద్ద వాహనాల పార్కింగ్‌పై ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణను వివరణ కోరగా... పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థి మృతి ఘటనలో నలుగురిపై కేసు

... 5వ పేజీ తరువాయి

తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు, మండలస్థాయి అధికారులు వచ్చి.. పాఠశాల నిర్వాహకులను రప్పిస్తామని, సంయమనం పాటించాలని కోరారు. కానీ పాఠశాల నిర్వాహకులు రాకపోవడంతో రాత్రి అక్కడే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. కాగా ఆర్మీలో పనిచేస్తున్న విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు ఇటీవల సెలవుపై ఎలమంచిలి వచ్చారు. సెలవులు ముగియడంతో గురు వారం ఉదయం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. సాయంత్రం కుమారుడు మృతిచెందిన వార్త తెలియడంతో ప్రయాణిన్ని రద్దుచేసుకుని శుక్రవారం ఉదయం 11 గంటలకు పాఠశాల వద్దకు వచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. అనంతరం పోలీసులు గట్టి బందోబస్తు మధ్య పాఠశాల ఎండీ సుందరయ్య, డైరెక్టర్ రమణాజీతోపాటు బస్సు డ్రైవర్, క్లాస్‌టీచర్‌ను తీసుకువచ్చారు. అయితే పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వారిని జీపులో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు బాలుడి తల్లి నాగశ్రీలత స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ చెప్పడంతో శ్రీలత... పాఠశాల యాజమాన్యం, బస్సు డ్రైవర్, క్లాస్ టీచర్‌ను బాధ్యులను చేస్తూ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆందోళన విరమించారు. పోలీసులు బాలుడి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎలమంచిలి సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వానపోయి.. దుమ్ము వచ్చే..

... 5వ పేజీ తరువాయి

ముకుందపురం, కేజేపురం, ఎం.కోటపాడు, డి.సురవరం, సాగరం, ఎం.కోడూరు, కాశీపురం గ్రామాల వద్ద పాత రోడ్డును పూర్తిగా తొలగించారు. ఆయా ప్రదేశాల్లో సిమెంట్ వెట్ మిక్సర్ వేసి రోలింగ్‌చేశారు. అనంతరం దీనిపై బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు అధిక వర్షాలు పడడంతో సిమెంట్ వెట్‌మిక్సర్ పాడైపోయి కంకర, రాళ్లు పైకితేలాయి. రోడ్డంతా పొడిగా ఉండడంతో వాహనాలు వెళుతున్నప్పుడు దుమ్ము, ధూళి ఎగసిపడి ఇవరై మీటర్ల దూరంలో దాటితే కనిపించని పరిస్థితి నెలకొంది. కంకర, రాళ్ల రోడ్డుపై చెల్లాచెదురుగా పడివుండడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటి చిన్నపాటి వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా వున్న ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి చొరబడుతున్నది. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి, రోడ్డుపై తేలిన కంకర, రాళ్లను రోలింగ్ చేయించడంతోపాటు దుమ్ము, ధూళి ఎగిసిపడకుండా తరచూ నీటిని చల్లించాలని వాహనదారులు, రహదారికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సు ప్రయాణికుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

సాగిస్తుంటారు. కొంతమంది ఆటోలను ఆశ్రయిస్తుండగా ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులపైన.. అది కూడా పల్లెవెలుగు బస్సులపై ఆధారపడుతున్నారు. పాయకరావు పేట నుంచి అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లే పల్లె వెలుగు బస్సులు నక్కపల్లి మండలంలోనే నిండిపోయి, చాలా మంది నిల్చుని వుంటున్నారు. దీంతో ఎస్.రాయవరం మండలానికి చెందిన ప్రయాణికులు బస్సు ఎక్కడానికి, కనీసం నిల్చుని ప్రయాణించడానికి కూడా చోటు వుండడంలేదు. ఈ కారణంగా ఆయా గ్రామాల స్టాప్‌ల వద్ద డ్రైవర్లు బస్సులను ఆపడంలేదన్న ఆరోపణలు వినిపి స్తున్నాయి. దీంతో విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరుకాలేకపోతున్నారు. ప్రధానంగా ఎలమంచిలి చెంతనే ఉన్న రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం, లైనుకొత్తూరు గ్రామాల విద్యార్థులకు ఈ సమస్య అధికంగా వుంది. అష్టకష్టాలు పడి పాఠశాల/ కళాశాలకు వెళితే.. మళ్లీ సాయంత్రం ఇంటికి రావడానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కడానికి యుద్ధమే చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. అనకాపల్లి వైపు నుంచి అడ్డరోడ్డు, పాయకరావుపేట వైపు వెళ్లే పల్లెవెలుగు బస్సులు ఎలమంచిలి వచ్చేసరికి సీట్లన్నీ నిండిపోవడమే కాకుండా చాలా మంది నిల్చుని వుంటున్నారు. ఎక్కడ ఐదారుగురు బస్సు దిగితే.. పందమందికిపైగా బస్సు ఎక్కేవారు వుంటున్నారు.

బస్సు రావడమే తరువాయి.. ఒక్కసారిగా తోసుకుంటూ గేటు వద్దకు వెళుతున్నారు. బస్సులో నిల్చుని వెళదామన్నా ఖాళీ లేని పరిస్థితి నెలకొంటున్నది. అబ్బాయిలు, యువకులు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. అమ్మాయిలు, మహిళలు అంత సాహసం చేయలేక.. మరో బస్సు కోసం వేచి వుంటున్నారు. దీంతో ఇంటికి చేరేసరికి రాతి ఏడేనిమిది గంటల అవుతున్నదని విద్యార్థినులు వాపోతున్నారు. ఇక చిన్నపిల్లలు, లగేజీతో ప్రయాణించే మహిళల ఇక్కట్లు వర్ణనాతీతం. దీంతో పలువురు మహిళలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎలమంచిలి మీదుగా మరిన్ని పల్లె వెలుగు బస్సులు నడిచేలాచర్యలు చేపట్టాలని ప్రయాణికులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604